నాణ్యతా ప్రమాణాల్లో భేష్

- అర్వపల్లి పీహెచ్‌సీకి జాతీయ స్థాయిలో గుర్తింపు
- అంచెలంచెలుగా అన్ని వసతుల కల్పన
- కేంద్రం నుంచి అందనున్న ప్రత్యేక నిధులు


అర్వపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

అర్వపల్లి : రోగులకు వైద్య సేవలు అందించడంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుని భేష్ అని అనిపించుకుంటుంది అర్వపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం. ఈ పీహెచ్‌సీ నాలుగు రోజుల కిందట కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ నుంచి నాణ్యతా ధ్రువీకరణ పత్రం కూడా పొందింది. దీంతో ఆస్పత్రిలో వైద్య సేవలు మరింత నాణ్యతా ప్రమాణాలతో అందనున్నాయి. ఈ ధ్రువీకరణ పత్రం రావడంతో ప్రతి ఏటా ఈ పీహెచ్‌సీకి కేంద్రం నుంచి అభివృద్ధి కోసం ప్రత్యేక నిధుల కేటాయింపు జరగనుంది.

అన్ని విభాగాల్లో..

అర్వపల్లిలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు వైద్య సేవలందించడంలో 180 రకాల రికార్డులను నిర్వహిస్తున్నారు. అలాగే ల్యాబ్, ఫార్మసీ గది, ప్రసూతి వార్డు, జనరల్ వార్డు తదితర వాటి నిర్వహణను నాణ్యతతో చేపడుతున్నారు. అలాగే ఫైర్ సేఫ్టీ పరికరాలను ఏర్పాటు చేశారు. బయోమెడికల్ వేస్టును పారవేయుటకు చెత్తకుండీలను ఏర్పాటు చేశారు. అలాగే ఎల్లోజోన్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ప్రసూతి వార్డులో గ్లీజర్‌ను, నాలుగు బోట్ల ఏసీలను ఏర్పాటు చేశారు. ఆస్పత్రిలో అందించే ప్రతి సేవను తెలిపే నేమ్ బోర్డులను ఏర్పాటు చేశారు. మందుల స్టాకు, ఏఏ మందులు ఉన్నాయి, వాటిని వాడే విధానం, ఏఏ జబ్బులకు ఏఏ మందు వాడాలనే దానిపై ఫ్లెక్సీలు రాసి పెట్టారు. తాజాగా సుమారు రూ.2లక్షల వ్యయంతో వసతులు, మరమ్మతులు చేపట్టారు.

జాతీయ స్థాయిలో గుర్తించడం సంతోషకరం


పీహెచ్‌సీలో నాణ్యత ప్రమాణాలతో కూడిన వైద్య సేవలు అందిస్తున్నందుకు గానూ జాతీయ స్థాయిలో కేంద్రం గుర్తించడం సంతోషకరం. కార్పొరేట్ ఆస్పత్రికి దీటుగా వైద్య సేవలు అందుతున్నందున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– ఎల్. చరణ్, సీహెచ్ఓ

సమష్టి కృషివల్లే గుర్తింపు


ఆస్పత్రి వైద్యసిబ్బంది, క్షేత్ర స్థాయిలో పని చేసే సిబ్బంది అందరి కృషి వల్లే పీహెచ్‌సీకి జాతీయ స్థాయిలో నాణ్యత ధ్రువీకరణ పత్రం పొందగలిగాం. పీహెచ్‌సీలో రోగులకు అన్నిరకాల వైద్య సేవలందిస్తున్నాం. అలాగే ఆస్పత్రిలో రోగులకు ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులను కల్పించడం జరుగుతుంది.

– సీహెచ్ మణిదీప్, పీహెచ్‌సీ వైద్యాధికారి

ఘనంగా పట్టణ ప్రగతి దినోత్సవం


తిరుమలగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

తిరుమలగిరి : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం తిరుమలగిరి మున్సిపాలిటీలో పట్టణ ప్రగతి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు, మున్సిపాలిటీ సిబ్బంది స్థానిక తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి మానవ హారంగా ఏర్పడ్డారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో పట్టణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పోతరాజు రజనిరాజశేఖర్ మాట్లాడారు. పట్టణ ప్రగతి వల్ల మున్సిపాలిటీ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని అన్నారు. సిబ్బందికి దుస్తులను పంపిణీ చేశారు. పలువురికి ప్రశంసపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ దండు శ్రీనివాస్, మేనేజర్ బుచ్చిబాబు, సిబ్బంది ఖదీర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


తిరుమలగిరిలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ పోతరాజు రజని

ఉమామహేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకం


స్వామి వారికి రుద్రాభిషేకం చేస్తున్న పండితులు


పెన్‌పహాడ్: పూజలు చేస్తున్న భక్తులు

చివ్వెంల : ఉండ్రుగొండ శివారులోని గిరిదుర్గంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రుద్రాభిషేకం నిర్వహించారు. జ్యేష్ఠామాస శివరాత్రి సందర్భంగా లఘున్యాస పూర్వక రుద్రాభిషేకం జరింపించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వేదపండితులు మంత్రోచ్ఛరణతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చకిలం కృష్ణకుమార్, కట్టెకోల మధుసూదనచారి, బందకవి క్రిష్ణమోహన్, ఆకునూరి పాండురంగారావు పాల్గొన్నారు.

నూతన దేవాలయంలో ప్రత్యేక పూజలు

పెన్‌పహాడ్ : దూపహాడ్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామచంద్రస్వామి దుర్గా మహేశ్వర ఆలయంలో దేవాలయ నిర్మాణ కర్త, సర్పంచ్ బిట్టు నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో గ్రామస్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు చేశారు. ప్రభబండ్లను ఊరేగింపుగా దేవాలయం వద్దకు తీసుకువచ్చారు. కోలాటాలు, భజనలు నిర్వహించి పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

కేటీఆర్ సభను విజయవంతం చేయాలి


తుంగతుర్తి : మాట్లాడుతున్న యుగేందర్‌రావు

తుంగతుర్తి : తిరుమలగిరి మండల కేంద్రంలో ఈ నెల 24న జరిగే బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు గుజ్జ యుగేందర్‌రావు కోరారు. శుక్రవారం నియోజకవర్గ కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలో వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో మంత్రి కేటీఆర్ పాల్గొంటారని తెలిపారు. అనంతరం జరిగే బహిరంగ సభలో పాల్గొంటారని అన్నారు. నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, వైస్ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, గుండగాని రాములుగౌడ్, దొంగరి శ్రీనివాస్, గొడిచర్ల సత్యనారాయణ, సంతోష్, రమేష్, శ్రీనివాస్, తునికి సాయిలు, యాదగిరి, నాగయ్య, పరమేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్దిరాల : ఈ నెల 24న తిరుమలగిరిలో జరిగే కేటీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్‌ఏ.రజాక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి భారీగా బహిరంగ సభకు తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీపీ గుడ్ల ఉపేంద్ర వెంకన్న, జెడ్పీటీసీ కన్న సురాంభ వీరన్నగౌడ్, వైస్ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, మల్లు కపోత్తంరెడ్డి, వడ్డాణం మధుసూదన్, పాలబిందెల శ్రీనివాస్, వల్లపు రమేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపులకు రూ.లక్ష ఆర్థికసాయం వర్తింపజేయాలి

అర్వపల్లి : బీసీలకు కులవృత్తుల కోసం ప్రభుత్వం అందించే రూ.లక్ష సాయాన్ని మున్నూరుకాపులకు వర్తింపజేయాలని మున్నూరుకాపు యువక మండలి మండల అధ్యక్షుడు కడారి కర్ణాకర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానికంగా జరిగిన సమావేశంలో మాట్లాడారు. బీసీలకు అందించే సహాయంలో మున్నూరుకాపులను విస్మరించడం శోచనీయమన్నారు. వెంటనే మున్నూరుకాపులకు అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఈ సమావేశంలో మున్నూరు కాపు సంఘం నాయకులు పుప్పాల ప్రభాకర్, వినయ్, ఏకస్వామి, సోమశేఖర్, రవికాంత్, సతీష్, హరీష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు, విత్తనాలు అందించాలని వినతి


నాయబ్ తహసీల్దార్ కంట్లమయ్యకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

అర్వపల్లి : రైతులకు ఉచితంగా ఎరువులు, విత్తనాలు అందించాలని అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శంకర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి నాయబ్ తహసీల్దార్ కంట్లమయ్యకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. రైతులకు రూ.లక్ష నుంచి ఆపై ఉన్న బ్యాంకు రుణాలను మాఫీ చేయాలని కోరారు. సబ్సిడీలు, పంట నష్టపరిహారం, పంటరుణాలు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, ఏఐకేఎంఎస్ నాయకులు పోలెబోయిన లింగయ్య, నర్సయ్య, మల్లయ్య, సతీష్, మధుకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జాడలేని రెండో విడత గొర్రెల పంపిణీ


మాట్లాడుతున్న వజ్జె వినయ్‌యాదవ్

అర్వపల్లి : రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమం జాడలేకుండా పోయిందని గొర్రెల మేకల పెంపకదారుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వజ్జె వినయ్‌యాదవ్ అన్నారు. శుక్రవారం రామన్నగూడెం గ్రామంలో జరిగిన గొర్రెల కాపరుల సమావేశంలో మాట్లాడారు. గొల్లకురుమలకు రెండో విడత గొర్రెల పంపిణీని ఇటీవల వెంటనే చేపడతామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఏదో మొక్కుబడిగా ఒకటి రెండు గ్రామాలకే పరిమితం చేసిందని విమర్శించారు. వేల సంఖ్యలో డీడీలు కట్టి నెలలు గడుస్తుండటంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోయి గొల్లకురుమలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం ఇప్పటికైనా రెండోవిడత లబ్ధిదారులందరికి గొర్రెలను పంపిణీ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు మేడెబోయిన యాదగిరి, వాక శ్రీనివాసు, జాల యాదగిరి, వీరయ్య, కోటి, అంజయ్య, గురువయ్య, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెస్‌తో మేధోశక్తి పెరుగుతుంది


చెస్ అకాడమీని ప్రారంభిస్తున్న ఉపేందర్

భానుపురి : చెస్ క్రీడ చిన్నారుల్లో మేధోశక్తిని పెంచడంతోపాటు సమాజంలో అన్నిరంగాల్లో ముందుండేందుకు దోహదపడుతుందని కల్నల్ సంతోష్‌బాబు తల్లిదండ్రులు బిక్కుమళ్ల ఉపేందర్, మంజుల అన్నారు. శుక్రవారం పట్టణంలోని కృష్ణవేణి స్కూల్ సమీపంలో ఏర్పాటు చేసిన ఎస్ఎస్ కింగ్స్ చెక్ అకాడమీని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను చెస్‌లో ప్రావీణ్యం పొందేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ సతీష్‌కుమార్, సాయికుమార్, లింగారెడ్డి, మురళి, కవిత, హైమావతి, మల్లయ్య, రాంమూర్తి, సైదులు పాల్గొన్నారు.

ఉచిత బస్‌పాస్‌లు పంపిణీకి సిద్ధం

కోదాడఅర్బన్ : ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఆర్టీసీ ఉచిత బస్‌పాస్‌లు అందించేందుకు సిద్ధంగా ఉందని కోదాడ ఆర్టీసీ డిపో మేనేజర్ దేవులపల్లి శ్రీహర్ష తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యార్థులు రూ.50 డీడీ చెల్లించి ఏడాది పాటు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చని తెలిపారు. పాఠశాలల్లో చదివే 12 సంవత్సరాల లోపు బాలురు, 18 సంవత్సరాలలోపు బాలికలు ఉచిత బస్‌పాస్ సౌకర్యానికి అర్హులని తెలిపారు. పాఠశాల విద్యార్థులకు శనివారం నుంచే బస్‌పాస్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇంజనీరింగ్, పీజీ కళాశాలలు కొత్త వాటికి రూ.7000లు, రెన్యువల్‌కు రూ. 6000లు, డిగ్రీ కొత్త కళాశాలలకు రూ.6000లు, రెన్యువల్‌కు రూ.5000లు, జూనియర్ కళాశాలలో డిప్లమా, ఐటీఐ కళాశాలల్లో కొత్తవాటికి రూ.5000లు, రెన్యువల్‌కు రూ.4000లు, ప్రైవేటు స్కూళ్లకు కొత్త వాటికి రూ.2000లు, రెన్యువల్‌కు రూ.1500లు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రైవేటు స్కూళ్లకు కొత్తవాటికి రూ. 1000లు, రెన్యువల్‌కు రూ.1000లు అన్ని జాతీయ బ్యాంకుల్లో చెల్లుబాటు అయ్యే డీడీ రూపంలో చెల్లించాలని, డీడీతో పాటు పాఠశాల వివరాలను ఆర్టీసీ బస్ పాస్ కౌంటర్‌లో అందజేయాలని ఆయన కోరారు. బస్‌పాస్‌ల వివరాల కోసం సెల్ నంబర్లు 7382833303, 7382833498, 7780433533ను సంప్రదించాలని చెప్పారు.

ఫిట్‌నెస్ ఉన్న బస్సులకే అనుమతులు ఇవ్వాలి

చిలుకూరు : ఫిట్‌నెస్ లేని ప్రైవేటు బస్సులను నడుపుతున్న పాఠశాల యాజమాన్యాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీఎస్ఎస్ఎఫ్ విద్యార్థి సంఘం కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పట్టా నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను బస్సుల్లో ఇష్టానుసారంగా ఎక్కిస్తున్నారని, విద్యార్థులను తీసుకెళ్లే బస్సులను ఆర్టీఏ అధికారులు తనిఖీ చేసి ఫిట్‌నెస్ ఉన్నవాటికే అనుమతులు ఇవ్వాలని కోరారు. ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేయాలని, సంబంధిత యాజమాన్యాలపై కేసులు నమోదు చేయాలన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు


లక్ష్మాపురంలోని వ్యవసాయ క్షేత్రంలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్


పసునూర్ శివారులో..


ఈటూరు శివారులో..

- రక్షణ వలయాలు లేకపోవడంతో పొంచివున్న ముప్పు
- మూగజీవాలు మృత్యువాత పడుతున్నా పట్టించుకోని అధికారులు

నాగారం : విద్యుత్ సరఫరాలో హై, లోవోల్టేజీలను నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. మండలంలోని నాగారం, ఫణిగిరి, పసునూర్, పస్తాల, లక్ష్మాపురం, డి.కొత్తపల్లి, ఈటూరు తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను నేలకు మూడు, నాలుగు ఫీట్ల ఎత్తులో ఏర్పాటు చేశారు. నిత్యం ప్రజలు సంచరించే ప్రదేశాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఎలాంటి రక్షణ వలయాలు లేకుండా ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

మృత్యువాత పడుతున్న మూగజీవాలు..

గ్రామాల్లో, వ్యవసాయ పొలాల వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ వలయాలు లేక మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. వారం రోజుల్లో మండలంలోని ఫణిగిరి, ఈటూరు గ్రామాల్లో నాలుగు ఎద్దులు విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందటం గమనార్హం. అలాగే గతేడాది కాలంలో మండలంలో సుమారు 20 వరకు మూగజీవాలు విద్యుత్ షాక్‌తో మృతిచెందాయి. ప్రతి రోజు ఎక్కడో ఒక చోటు విద్యుత్‌షాక్‌కుగురై ఆవులు, గేదెలు మృతి చెందుతున్నా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదు. మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ అధికారులు ఈ ట్రాన్స్‌ఫార్మర్లను ఎలాంటి ఇనుప కంచెలు కానీ గోడలు కానీ లేకుండా జనసంచార ప్రదేశాల్లో, వ్యవసాయ పొలాల వద్ద చేతికి అందే ఎత్తులో ఏర్పాటు చేశారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్లు రోడ్లకు దగ్గరగా కిందికి ఉండటంతో పశువులు వాటికి సమీపంలో మేత మేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌గురై తమ ప్రాణాలు కోల్పోతున్నాయి. దీనికితోడు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మంటలు, శబ్దాలు, పొగలు రావడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. దీంతో ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైన విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణగోడలు, ఇనుపకంచెలు ఏర్పాటుచేసి ప్రమాదాలను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రక్షణ వలయాలు ఏర్పాటు చేయాలి


గ్రామాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ వలయం లేకపోవడంతో పశువులు మృత్యువాత పడుతున్నాయి. పశువులు మేత కోసం వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుత్‌షాక్‌కు గురవుతున్నాయి. గ్రామాల్లో రోడ్లకు దగ్గరగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ వలయాలు ఏర్పాటు చేయాలి.

– ఎస్‌కే.వలీ, శాంతినగర్

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


అడ్మిషన్ ఇస్తున్న హెచ్‌ఎం దామెర శ్రీనివాస్

నూతనకల్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ప్రధానోపాధ్యాయుడు దామెర శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 100వ అడ్మిషన్ ఇచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడారు. బడిబాటలో భాగంగా ఇప్పటి వరకు నూతనంగా 100అడ్మిషన్స్ వచ్చినట్లు తెలిపారు. పాఠశాలలో ఇప్పటి వరకు 470 అడ్మిషన్ ఉన్నాయని, మరో 200అడ్మిషన్‌లు వస్తాయని తెలిపారు. 2022–23విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 100మంది విద్యార్థులకు గాను 98మంది విద్యార్థులకు ఉత్తీర్ణత సాధించారని అన్నారు. పాఠశాలకు చెందిన భౌష్య 9.5 జీపీ సాధించి మండలంలోనే మొదటి స్థానం సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరినీ ఓటరుగా నమోదు చేయాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ ఎండీ జమీరుద్దీన్

నూతనకల్ : అర్హులైన యువతి, యువకులను ఓటర్లుగా నమోదు చేయాలని తహసీల్దార్ ఎండీ జమీరుద్దీన్ కోరారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు నమోదుపై బీఎల్‌ఓలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీధర్ నాయక్, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

పీవైఎల్ మహాసభల కరపత్రం ఆవిష్కరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కోదాడఅర్బన్ : సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 24న నిర్వహించబోయే ప్రగతి శీల యువజన సంఘం (పీవైఎల్) మహాసభను విజయంతం చేయాలని పీవైఎల్ రాష్ట్ర నాయకుడు డి.రవి పిలుపునిచ్చారు. శుక్రవారం కోదాడలోని లాల్ బంగ్లాలో మహాసభల కరపత్రాన్ని స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలు, పాలక వర్గాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చేయవలసిన పోరాటాలు, ఉద్యమ కర్తవ్యాలను ఈ మహాసభల్లో నిర్దేశించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ డివిజన్ అధ్యక్షుడు కామల్ల అనంతరామయ్య, నాయకులు నాగరాజు, బ్రహ్మం, సైదులు, సురేష్, కొండలు, ప్రతాప్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మృతులకు నివాళి


రేహాన్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి

పెన్‌పహాడ్ : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎస్‌కే. సైదులు కుమారుడు ఎస్‌కే. రేహాన్ (09) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. అతడి మృతదేహాన్ని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి సందర్శించినివాళులర్పించారు. కార్యక్రమంలో కొప్పుల వేణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సురేష్‌రావు, శెనగాని రాంబాబుగౌడ్, ఒగ్గు సైదులు, కత్తి రవీందర్, క్రాంతికుమార్, రవి, సైదులు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మృతురాలుకు నివాళి

నాగారం : మండల పరిధిలోని ఈటూరు గ్రామానికి చెందిన వంగూరి ఉప్పలమ్మ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడిపాటి నర్సయ్య మృతురాలి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్‌పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, నాయకులు వంగూరి కుమార్, బోడ అంజయ్య, వంగూరి సుధాకర్, యల పాపయ్య, వంగూరి భిక్షం, అవిలయ్య తదితరులు పాల్గొన్నారు.

350 మందికి వైద్య పరీక్షలు

నడిగూడెం : మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో గల టీడీపీ కార్యాలయంలో శుక్రవారం స్వయం కృషి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నార్కెట్‌పల్లి కామినేని ఆస్పత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 42 మందిని కంటి శస్త్ర చికిత్సకు సిఫారసు చేశారు.

క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న ఏపూరి సోమన్న

నాగారం : మండల పరిధిలోని ఈటూరు గ్రామానికి చెందిన బోడ ఎల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏపూరి సోమన్న శుక్రవారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5,000 ఆర్థికసాయం అందజేశారు. అలాగే గ్రామానికి చెందిన వంగూరి ఉప్పలమ్మ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందటంతో ఆమె మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ నాయకులు దున్నపోతుల చంద్రశేఖర్, వంగూరి దామోదర్, చింతకుంట్ల పరమేష్, ఏపూరి యాకన్న, పేరాల దయానంద్, వంగూరి ఉప్పలయ్య, గంగి వెంకన్న, బోడ నాగన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు గిరిజన ఉత్సవాలు

తుంగతుర్తి : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు తుంగతుర్తి మండలంలో నిర్వహించే గిరిజన ఉత్సవాలను జయప్రదం చేయాలని సూర్యతండా సర్పంచ్ గుగులోతు యాకునాయక్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల పరిధిలోని గిరిజన తండాల్లో నేడు జరిగే గిరిజనోత్సవాలు, కార్యక్రమాలకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆయనతో పాటు గిరిజనులు, తదితరులు ఉన్నారు.

గడువు పొడిగించాలి

నూతనకల్ : రూ.లక్ష ఆర్థికసాయానికి సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ప్రభుత్వం గడువు పెంచాలని సీపీఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తిదారులకు రూ. లక్ష ఆర్థికసాయం అందించడానికి ఈ నెల 20 వరకు గడువు ఇచ్చిందని అన్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీలో ఆలస్యం ఏర్పడటంతో చాలా మంది నేటికీ సర్టిఫికెట్లు పొందలేదని తెలిపారు. ఆన్‌లైన్‌లో సమస్యలు ఏర్పడటం వల్ల కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందించలేదని అన్నారు. ప్రభుత్వం సమస్యను గుర్తించి దరఖాస్తుల గడువును మరో 10రోజులు పెంచాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు తొట్ల నాగరాజు, వెంకన్న, రాంమూర్తి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టికెట్ కేటాయిస్తే గెలుపు ఖాయం


మాట్లాడుతున్న మందుల సామేలు

తుంగతుర్తి : రానున్న ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ పార్టీ టికెట్ స్థానికుడినైనా తనకు కేటాయిస్తే తన గెలుపు ఖాయమని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ మందుల సామేలు ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం గొట్టిపర్తి గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. నాడు టీఆర్‌ఎస్ ఆవిర్భావం నుంచి నేటి బీఆర్‌ఎస్ వరకు పార్టీలో కీలకంగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేశానని అన్నారు. అనంతరం తెలంగాణ ఉద్యమంలో తనతో కలిసి పనిచేసిన వారిని శాలువాలతో సన్మానించారు. ఈ సమావేశంలో కేతిరెడ్డి రమేష్‌రెడ్డి, కూరాకుల యాదగిరి, చిప్పపల్లి రాములు, కండే ఎల్లయ్య, రాజు, శ్రీను, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

గరుడవాహన సేవ

భానుపురి : పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి గరుడవాహన సేవను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 8 గంటలకు ద్వారతోరణ, ధ్వజకుంభ ఆరాధన, చతుస్థానార్చన వేద ప్రబంధ పారాయణం, పూర్ణాహుతి చేపట్టారు. కార్యక్రమంలో కార్య నిర్వహణాధికారి సీహెచ్ వెంకటనారాయణ, దేవాలయ ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు, ఆండాళ్‌గోష్టి భక్త బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

నాగారం : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఎద్దు మృతి చెందిన సంఘటన ఈటూరులో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన ప్రకారం.. నాగారం మండల పరిధిలోని ఈటూరు గ్రామానికి చెందిన రైతు కన్నెబోయిన రాములు రోజు వారిగానే తన పశువులను వ్యవసాయక్షేత్రంలోకి మేతకు తోలుకెళ్లాడు. ఎద్దు మేత మేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఈ గేదె విలువ సుమారు రూ.65 వేల వరకు ఉంటుందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరారు.